# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5

జయశంకర్ భూపాలపల్లి

ములుగు

ఆదివారం 14 జూలై 2024




# అడిగేవారు లేక..

సింగరేణి క్వార్టర్స్

## పేరుకుపోయిన సింగరేణి క్వార్టర్స్ అద్దె బకాయిలు

- వసూలు కావాల్సినవి రూ.2కోట్లకు పైనే..
- కేటాయింపులు ఒకరికి.. ఉండేది మరొకరు
- ప్రభుత్వ ఉద్యోగులదే సింహభాగం
- నోటీసులిచ్చినా స్పందించని వైనం
- ప్రైవేటు సంస్థలదీ అదే వైఖరి
- అడ్వాన్సులు లేవు.. కిరాయిలూ లేవు
- విచ్చలవిడిగా విద్యుత్ వినియోగం

భూపాలపల్లి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): సింగరేణి అనగానే కొందరికీ అదో కల్పతరువుగా మారిపోయింది. యాజమాన్యం నిర్లక్ష్యం, సిబ్బంది ఉదాసీనతతో ఏటా సంస్థకు కోట్లాది రూపాయల మేర గండి పడుతోంది. సింగరేణి సిబ్బంది, కార్మికుల కోసం యాజమాన్యం నిర్మించిన నివాస గృహాలు సింగరేణేతరుల పాలవుతున్నాయి. సంవత్సరాల కొద్దీ తిష్టవేసి సంస్థకు అద్దె చెల్లించకపోగా దత్తపుత్రుల తరహా అన్ని సౌకర్యాలూ అనుభవిస్తునారు. ఆఖరికి కరెంటు బిల్లులు చెల్లించకుండా వందల యూనిట్లు వాడుకుంటూ సంస్థకు ఎంచక్కా శఠగోపం పెడుతున్నారు. జిల్లాల పునర్విభజన తర్వాత కొత్త జిల్లాల సిబ్బందికి, ఉన్నతాధితారులకు, కార్యాలయాలకు సింగరేణి భవనాలు, రెసిడెన్షియల్ క్వార్టర్లను కేటాయించారు. ఈ క్రమంలో వందలాది మంది ఉద్యోగులతోపాటు కొన్ని ప్రైవేటు సంస్థలు కూడా తమ పలుకుబడిని ఉపయోగించి సింగరేణి యాజమాన్యంతో ఈ క్వార్టర్లను ఆక్రమించుకున్నాయి. కానీ అందులో చేరిన నాటి నుంచి నేటి వరకు నిబంధనల ప్రకారం సింగరేణికి అద్దె, నీటి బకాయిలు చెల్లించకుండా మొహం చాటేస్తున్నారు.

నిబంధనలను అనుసరించి క్వార్టర్లకు అద్దె ఖరారు చేశారు. ఇందులో ఎండీ టైప్ క్వార్టర్లకు నెల ఒక్కంటికి రూ.5,290, ఎంసీ టైపు క్వార్టర్లకు రూ.5,040, చెమ్రీ(సీహెచ్) టైపు క్వార్టర్లకు రూ.4,024 చొప్పున నిర్ణయించారు. దీంతోపాటు ఒప్పందం సమయంలోనే ఒక్కో క్వార్టర్‌కు నాలుగు నెలల అద్దెను అడ్వాన్స్‌గా చెల్లించాల్సి ఉంది. కానీ, ఇక్కడ అలాంటి దాఖలాలు కనిపించడం లేదు. ఇదంతా ఒకెత్తయితే.. బకాయిలకు సంబంధించి మే చివరి నాటికి రూ.4 కోట్ల పైచిలుకు పేరుకుపోయాయి. బకాయిలు చెల్లించాలంటూ సింగరేణి ఎస్టేట్ విభాగం సదరు అధికారులకు, సంస్థలకు నోటీసులు ఇచ్చి చేతులు దులిపేసుకుంది. సంస్థ ఆస్తులు, అప్పుల మదింపు సందర్భంగా భారీ ఎత్తున పేరుకుపోయిన బకాయిలపై కాగ్ మొట్టికాయలేసింది. అయినా చలించని సింగరేణి అధికారులు అద్దె వసూళ్లలో నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే.. రెండేళ్ల క్రితం సింగరేణి భవనాలను, క్వార్టర్లను వినియోగించుకున్న అధికారుల్లో 90 శాతం మంది దర్జాగా సౌకర్యాలను వాడుకొని బకాయిలు చెల్లించకుండా బదిలీపై వెళ్లిపోయారు. ప్రస్తుతం ఆ బకాయిలను ఎలా వసూలు చేయాలనేది సింగరేణి అధికారులకు తలబొప్పి కట్టిస్తోంది. క్వార్టర్లను వినియోగించుకున్న అధికారులు, ఉద్యోగులందరికీ ప్రభుత్వం హెచ్ఆర్ఏ రూపంలో అదనపు మొత్తాన్ని చెల్లిస్తున్నా అద్దెలు చెల్లించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. బకాయిలు చెల్లించాలని మొక్కుబడిగా నోటీసులు ఇవ్వడమే తప్ప గట్టిగా ప్రయత్నించక పోవడంతో ఈ పరిస్థితి నెలకొందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇలా సింగరేణికి పడిన బాకాయిలను పరిశీలిస్తే దాదాపు 200 మందికి పైగా లక్షల్లో బకాయి పడినవారే ఉన్నారు. ఇందులో కలెక్టర్ మొదలుకుని, క్లర్కుల వరకు ఉండడం గమనార్హం

### ఇదిగో జాబితా..

సింగరేణి సంస్థకు చెందిన క్వార్టర్లు వినియోగించుకుని అద్దె చెల్లించని వారి వివరాలను పరిశీలిస్తే విస్మయం వ్యక్తమవుతోంది. 'ఆంధ్రజ్యోతి' సేకరించిన సమాచారం ప్రకారం భూపాలపల్లి ప్రాంతంలో మే నెల నాటికి మొత్తం రూ.2,15,67,556 బకాయిలు పేరుకుపోయినట్లు తేలింది. ఇందులో భూపాలపల్లి కలెక్టర్ క్వార్టర్‌కు సంబంధించి రూ.7,79,364 బకాయి పడ్డారు. 2016 అక్టోబరు నుంచి ఇంత వరకు అద్దె చెల్లించనట్లు తెలిసింది. ఇలా చెప్పుకుంటూ పోతే... సుమారు 200 మంది రూ.లక్ష నుంచి రూ.7లక్షల వరకు బాకీ ఉన్నారు. అధిక మొత్తంలో బాకీ ఉన్న మొదటి 10మంది జాబితా ఇలా ఉంది.

| సంఖ్య | క్వార్టర్ నంబరు | బకాయిపడిన మొత్తం (లక్షల్లో) |
|---|---|---|
| 1. | ఎస్‌పీ-01 | రూ.4,95,853 |
| 2. | ఎంబీ-842 | రూ.4,56,478 |
| 3. | ఎంబీ-57 | రూ.4,20205 |
| 4. | ఎంపీ-24 | రూ.3,68,762 |
| 5. | ఎంపీ-23 | రూ.3,30,710 |
| 6. | ఎండీ-862 | రూ.3,01,808 |
| 7. | ఎస్‌బీ-01 | రూ.3,00,775 |
| 8. | ఎంసీ-39 | రూ.3,00,618 |
| 9. | ఎండీ-861 | రూ.2,98,365 |
| 10. | ఎండీ-866 | రూ.2,94,997 |

## ఘోర రోడ్డు ప్రమాదం

- గేదె కళేబరాన్ని తప్పించబోయి కంటైనర్‌ను ఢీకొట్టిన ఆటో
- దంపతులు, కూతురు, డ్రైవర్ దుర్మరణం
- మరొకరికి తీవ్ర గాయాలు
- కూతురిని బస్సు ఎక్కించేందుకు వెళ్తుండగా ఘటన



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సత్యనారాయణరాజు (ఫైల్), సత్యవతి (ఫైల్), డ్రైవర్ నాగరాజు (ఫైల్)

వివరాలు 7వ పేజీలో...

## కోటంచ ఆలయ అభివృద్ధికి 12.15 కోట్లు

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

రేగొండ, జూలై 13: కోటంచ ఆలయ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.12.15 కోట్లు మంజూరు చేసిందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండలంలోని కోటంచ లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని ఆయన శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని అన్నారు. అందులో భాగంగా కోటంచలో ఆలయ విమానగోపురం, అర్థమండపం, మహామండపం, అద్దాల మండపం, అల్వార్ నిలయం, పాకశాల, అన్నదాన సత్రం, క్యూలైన్ల ఏర్పాటు, డ్రెయినేజీ, కాటేజీలు, సాలాహారం కాంపౌండ్ వాల్, ఓహెచ్ఎస్ వాటర్ ట్యాంక్, ఆఫీస్ భవనం, వసతి గృహాలను నిర్మించనున్నట్లు వివరించారు. ఈ పనులను ఏడాదిలోగా పూర్తి చేస్తామని అన్నారు. అదేవిదంగా రూ. 59కోట్లతో బుద్ధారం- కోటంచ డబుల్ రోడ్డు నిర్మాణం పనులు త్వరలోనే మంజూరు అవుతాయని, ఇందుకు ప్రతిపాదనలు పంపించామని తెలిపారు. మీడియా సమావేశంలో ఆలయ చైర్మన్ భిక్షపతి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు ఎస్ఎస్ఆర్ సంపత్‌రావు, మాజీ పీఏసీఎస్ చైర్మన్ గుంటోజు కిష్టయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సన్న, మాజీ సర్పంచ్ పబ్బా శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకుడు పట్టెం శంకర్ తదితరులు పాల్గొన్నారు.

### ముదిరాజ్ మహాసభ పోస్టర్ ఆవిష్కరణ

భూపాలపల్లిటౌన్ : ముదిరాజ్‌ల మహాసభ పోస్టర్‌ను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు భూపాలపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముదిరాజ్‌ల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు జోరుక సదయ్య ప్రధాన కార్యదర్శి వేముల రాజమౌళి, నాయకులు చిలుకల పాణి, స్వామి, చింతల రమేష్, మొగిలయ్య, వెంకటేశ్వర్లు, అన్ని మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## ఫారస్టు సిబ్బందిపై ట్రాక్టర్ డ్రైవర్ దాడి



పారతో దాడి చేయడంతో వాచర్ చేతికి గాయం

వెంకటాపూర్(రామప్ప), జూలై 13: విధి నిర్వహణలో ఉన్న అటవీశాఖ సిబ్బందిపై ఇసుక ట్రాక్టర్ డ్రైవర్ దాడికి దిగారు. శుక్రవారం అర్ధరాత్రి ములుగు జిల్లా వెంకటాపూర్ (రామప్ప) మండలంలోని బూర్గుపేట అటవీప్రాంతంలో ఈ సంఘటన చోటుచేసుకుంది. బూర్గుపేట అటవీ ప్రాంతం నుంచి గణపురానికి మూడు ఇసుక ట్రాక్టర్లు బయల్దేరాయి. మండలంలోని లక్ష్మీదేవిపేట మీదుగా ఇసుకను తరలిస్తున్నట్లు సమాచారం అందుకున్న అటవీ శాఖ సిబ్బంది వీర్లపల్లి వద్ద తనిఖీలు చేపట్టారు. ఈక్రమంలో ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను ఆపే ప్రయత్నం చేశారు. రెండు ట్రాక్టర్లు ఆగిపోగా మూడో ట్రాక్టర్ డ్రైవర్ వేగంగా వెళ్తుండటంతో అటవీ శాఖ వాచర్ ద్విచక్రవాహనంపై వెంబడించి ఆపారు. దీంతో ఇసుక ట్రాక్టర్ డ్రైవర్ ఆవేశంతో వాచర్‌పై దాడి చేసి అక్కడి నుంచి పరారీ అయ్యాడు. అంతే కాకుండా ఓ బీట్ ఆఫీసర్‌పై కూడా దాడి చేసినట్లు సమాచారం. ఈఘటనపై అటవీశాఖ సిబ్బంది స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఈవిషయమై స్థానిక ఎస్సై సతీష్‌ను వివరణ కోరగా అందుబాటులో లేరు.

## గంజాయి అంతర్రాష్ట్ర ముఠా గుట్టురట్టు

ఆరు నెలలుగా రహస్యంగా సరఫరా

ముగ్గురి అరెస్టు.. పరారీలో ఒకరు





నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ కిరణ్ ఖరే, స్వాధీనం చేసుకున్న గంజాయి

కృష్ణకాలనీ (భూపాలపల్లి), జూలై 13: గంజాయి అంతర్రాష్ట్ర ముఠా గుట్టును గణపురం పోలీసులు రట్టు చేశారు. ఆరు నెలలుగా ఎవరికీ అనుమానం రాకుండా జిల్లా పరిసర ప్రాంతాల కు సరఫరా చేస్తూ చివరకు పట్టుబడ్డారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ కిరణ్ ఖరే ఈ మేరకు వివరాలు వెల్లడించారు. గణపురం ఎస్సై సాంబమూర్తి నేతృత్వంలో శనివారం గాంధీనగర్ క్రాస్ సమీపంలో వాహనాలను పోలీసులు తనిఖీ చేస్తుండగా ఇద్దరు అనుమానాస్పదంగా తారసపడ్డారు. వారిని తనిఖీ చేయగా వారి వద్ద కిలో గంజాయి లభ్యమైంది. ఆ వెంటనే వారిని అదుపులోకి తీసుకొని విచారించగా తమ వద్ద ఇంకా గంజాయి ఉన్నట్లు ఒప్పుకున్నారు. వారు నివాసముంటున్న గదికి వెళ్లి తనిఖీ చేయగా మరో ఐదు కిలోల గంజాయి లభ్యమైంది. వారిని ఆరా తీయగా పలు విషయాలు వెలుగులోకి వచ్చాయి. బీహార్ రాష్ట్రం నలంద జిల్లా హిస్వా మండలం గౌరీ గ్రామానికి చెందిన గణేష్ ఠాకూర్, అదే గ్రామానికి చెందిన మింటు కుమార్, చందన్ పాశాన్, ఉత్తరప్రదేశ్‌కు చెందిన ప్రదీప్ ఆరు నెలల కిందట గణపురం మండలం చెల్పూరులోని రైస్ మిల్లులో పని చేసేందుకు వచ్చినట్లు తేలింది. రైస్ మిల్లులో పనితోపాటు గంజాయిని తీసుకొచ్చి జిల్లా పరిధిలోని వివిధ ప్రాంతాలకు సరఫరా చేస్తూ జల్సాలు చేస్తున్నట్లు అంగీకరించారు. ప్రదీప్ పరారీలో ఉండగా మిగిలిన ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్ చేసినట్లు ఎస్పీ వివరించారు. విలేకరుల సమావేశంలో డీఎస్పీ సంపత్‌రావు, చిట్యాల సీఐ డి.మల్లేష్, గణపురం ఎస్సై సాంబమూర్తి పాల్గొన్నారు. నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

## సంపత్తి పెరగాలంటే..

సస్యరక్షణ చర్యలు పాటిస్తే తెల్ల'బంగారమే'..

పత్తి పంటలో మంచి యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

సాగులో మెలకువలు అందిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

వివరాలు 8వ పేజీలో...

# త్వరలోనే పోడు భూములకు పట్టాలు

- కొత్త పోడు కొట్టడం మానేయాలి
- విరివిగా మొక్కలు నాటాలి
- గిరిజన ప్రాంత సమస్యల పరిష్కారానికి కృషి
- రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి సీతక్క



ప్రజాదర్బార్‌లో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

తాడ్వాయి, జూలై 13: పోడుభూములకు పట్టాలు అందించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణా భివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి సీతక్క తెలిపారు. కొత్త పోడు కొట్టడం మానేసి ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు నాటాలని అన్నారు. మండలంలోని లింగాల గ్రామంలో శనివారం జరిగిన ప్రజాదర్బార్ కార్యక్ర మంలో ఆమె మాట్లాడారు. గిరిజన ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను త్వర లోనే పరిష్కరిస్తానన్నారు. వికలాంగులకు సదరం క్యాంపు ఏర్పాటు చేస్తా నని తెలిపారు. మహిళలకు మీ-సేవ కేంద్రాల ఏర్పాటు, మహిళాశక్తి క్యాంటీన్ల ఏర్పాటుపై అవగాహన కల్పించి వారికి ప్రోత్సాహం అందిస్తామన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు పౌష్టి కాహారం అందించాలని అంగన్‌వాడీ టీచర్లను మంత్రి ఆదేశించారు. అనంత రం లింగాల, లవ్వాల, బందాల, కొడిశాల గ్రామాలకు చెందిన ప్రజల నుంచి పోడుభూములకు పట్టాలు, జీసీసీ డిపో ఏర్పాటు, రోడ్లు, కరెంటు, బస్సు రవాణా, తదితర సమస్యలపై దరఖాస్తులను స్వీకరించారు. ఈ కార్యక్రమం లో కలెక్టర్ టి.ఎస్.దివాకర, ఎస్పీ శబరీశ్, అదనపు కలెక్టర్ పి.శ్రీజ, ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, తాడ్వాయి మండల ప్రత్యేక అధికారి అల్లెం అప్పయ్య, డీఈవో పాణిని, తహసీల్దార్ రవీందర్, విద్యుత్ శాఖ, మిషన్ భగీరథ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### సీజనల్ వ్యాధులపై ప్రత్యేక దృష్టి

ఏజెన్సీ ప్రాంతంలో సీజనల్ వ్యాధులపై ప్రత్యేక దృష్టి సారించినట్లు మం త్రి ధనసరి సీతక్క అన్నారు. తెలంగాణ రాష్ట్రంలోనే తొలిసారి మండలంలోని పోసాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన కంటైనర్ ఆస్పత్రిని(ఆరోగ్య ఉప కేంద్రం) ఆమె ప్రారంభించారు. ఐదు మారుమూల గ్రామాల ప్రజల అవసరం కోసం కంటైనర్ ఆస్పత్రిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోసాపూర్ ప్రాంతంలో గుట్టలపై ఐదు గ్రామాల ప్రజలు నివసిస్తున్నారని, వారికి ఆరోగ్య సమస్యలు వస్తే అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కలెక్టర్ దివాకర ప్రత్యేక చొరవతో రాష్ట్రంలోనే తొలి కంటైనర్ ఆస్పత్రిని ఏర్పాటు చేసి నట్లు తెలిపారు. ఆస్పత్రిలో అత్యవసర చికిత్సల కోసం నాలుగు పడకల కోసం సుమారు రూ.7లక్షలు వెచ్చించినట్లు చెప్పారు. ఇందులో అవసరమైన మందులు ఏర్పాటు చేయడంతోపాటు ఒక ఏఎన్ఎం, ఒక ఆశా కార్యకర్త విధులు నిర్వర్తిస్తారని అన్నారు. అనంతరం మంత్రి సీతక్క పోసాపూర్‌లోని గురుకులాన్ని పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడుతూ ప్రభుత్వం అందించే ఏకరూప దుస్తులు, పాఠ్యపుస్తకాలు అందుతున్నాయా లేదా అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని, పిల్లలకు అందించే ఆహారంలో నాణ్యత పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ .దివాకర, ఎస్పీ శబరీశ్, అదనపు కలెక్టర్ పి.శ్రీజ, డీఎంహెచ్‌వో డాక్టర్ అల్లెం అప్పయ్య, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.



ప్రజా దర్బార్‌లో పాల్గొన్న ప్రజలు

# ట్రైబల్ వర్సిటీ స్థలం చుట్టూ హద్దురాళ్లు

ములుగు, జూలై 13: సమ్మక్క, సారక్క జాతీయ గిరిజన విశ్వవిద్యాలయం కోసం ప్రభుత్వం సేకరించిన స్థలం చుట్టూ రెవెన్యూ అధికారులు హద్దురాళ్లను ఏర్పాటు చేశారు. జూన్ 22న గట్టమ్మ సమీపంలో యూనివర్సిటీ ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలించిన కలెక్టర్ దివాకర.. రైతులు, అటవీశాఖ నుంచి సేకరించిన 337ఎకరాల చుట్టూ హద్దులు నిర్ణయించాలని అధికారులకు సూచించారు. వెంటనే పనులు మొదలుపెట్టిన అధికారులు యూనివర్సిటీ పేరును సూచించేలా ఎస్ఎస్‌సీటీయూ అని ఇంగ్లిష అక్షరాల్లో రాసిన రాళ్లను పాతించారు. గట్టమ్మ, పానీశ, ప్రేమ్‌నగర్, మాధవరావుపల్లి వరకు ఈ భూములు విస్తరించి ఉండగా అన్ని చోట్లా ఈరాళ్లను పాతించారు. ఎవ్వరైనా ఆక్రమించడానికి ప్రయత్నిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఓ ప్రకటనలో హెచ్చరించారు.



జాతీయరహదారి పక్క నుంచి ఏర్పాటు చేసిన హద్దురాళ్లు

## బొగత వద్ద పర్యాటకుల సందడి

వాజేడు, జూలై 13: తెలంగాణ నయాగరా బొగత జలపాతం వద్ద శనివారం పర్యాటకుల సందడి కనిపించింది. వారంత సెలవు కావడంతో సూదరు ప్రాంతాల నుంచి సందర్శకులు భారీగా తరలివచ్చారు. పాలనురగలా జాలువారుతున్న జలధారలను చూసి మంత్రముగ్ధులయ్యారు. ఇటీవల కురిసిన వర్షాలకు జలపాతం అందాలు కనువిందు చేస్తుండగా పర్యాటకులు తన్మయత్వం పొందారు. జలపాతం ఈత కొలనులో జలకాలాడారు. బొగత అందాలను కెమెరాల్లో బంధిస్తూ సెల్ఫీలు దిగారు. బొగత జలపాతం వద్ద వారాంత సెలవుల్లో ఇక నుంచి పోలీసుల ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సీఐ కుమార్‌కు ఓఎస్డీ మహేష్ గితే బాబా సాహెబ్ సూచించారు. జలపాతాన్ని సందర్శించిన ఆయన అక్కడున్న రక్షణ చర్యలపై ఆరా తీశారు. సూదుర ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకుల్లో కొంత మంది మద్యం సేవించి వచ్చే ఆస్కారం ఉండటంతో వారిపై నిఘా ఉంచాలన్నారు. శని, ఆదివారాల్లో మధ్యాహ్న సమయాల్లో పోలీసులు జలపాతం వద్ద రక్షణ చర్యల్లో పాల్గొనాలని ఆదేశించారు.



# ముదిరాజ్ కులస్థులను బీసీ ఏలో చేర్చాలి

**ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అశోక్**

హనుమకొండ చౌరస్తా, జూలై 13: రాష్ట్ర ప్రభుత్వం ముదిరాజ్ కులస్థుల అభివృద్ధికి కృషి చేయడంతో పాటు బీసీ ఏలో చేర్చాలని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లెబోయిన అశోక్ కోరారు. హనుమకొండ 10వ డివిజన్ మచిలీబజార్‌లోని తెలంగాణ ముదిరాజ్ మహాసభ కమ్యూనిటీ హాల్‌లో శనివారం జిల్లా ప్రధాన కార్యదర్శి పులి రజనీకాంత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో అశోక్ పాల్గొని ముందుగా మహాసభ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ మహాసభ పిలుపు మేరకు బీసీ డీలో ఉన్న ముదిరాజ్‌లను బీసీ ఏలోకి చేర్చాలనే నినాదంతోపాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ముదిరాజ్ కులస్థుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 15నుంచి 20వరకు జిల్లాలోని రెవెన్యూ అధికారులను కలిసి వినతిపత్రాలు అందించే కార్యక్రమం నిర్వహించనున్నట్లు అశోక్ తెలిపారు.

పులి రజనీకాంత్ మాట్లాడుతూ.. తెలంగాణలో అత్యంత ప్రాచీన, అధిక జనాభా గల కులమైన ముదిరాజ్, తెనుగోళ్లు, ముత్తరాసి అయిన తాము.. సమాజంలో అన్ని రంగాలలో వెనుకబడి ఉన్నామన్నారు. ముదిరాజ్ అభివృద్ధి కోసం కో-అపరేటివ్ సొసైటీ లిమిటెడ్‌ను ఏర్పాటు చేసి యేటా రూ.1000కోట్ల నిధులను కేటాయించాలని డిమాండ్ చేశారు. మత్స్యశాఖలోని సొసైటీలకు ఎన్నికలు జరపాలని, అదే విధంగా ఆసరా పించన్ సౌకర్యాలను కల్పించాలని, ప్రత్యేక గురుకుల పాఠశాలలు ఏర్పాటుతో పాటు ఉచితంగా చేప పిల్లల పంపిణీ పథకాన్ని కొనసాగించాలన్నారు. అధికార పార్టీలో ఎమ్మెల్యేలుగా ఉన్న ముదిరాజ్ కుల బంధువులకు మంత్రివర్గంలో స్థానం కల్పించడంతో పాటు నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పించాలని రజనీకాంత్ కోరారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ సభ్యులు చొప్పరి సోమయ్య, ఎస్‌ఆర్‌ఐ రాజ్‌కుమార్, పిట్టల సత్యనారాయణ, రవికుమార్, మహేందర్, బయ్య శోభన్, పులి మధు, కుమారస్వామి, సారంగపాణి, సాంబమూర్తి, విక్రమ్, బుచ్చిరాజు, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



ముదిరాజ్‌ల సమస్యలను పరిష్కంచాలని కోరుతూ ఏర్పాటు చేసిన వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ముదిరాజ్ కులస్థులు

## రూ.2లక్షల గుట్కా పట్టివేత


పట్టుకున్న గుట్కాతో పోలీసులు

వరంగల్ క్రైం, జూలై 13: వరంగల్ ఇంతేజార్‌గంజ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కేబీహెచ్‌ఎస్ కాలనీలో రూ.2లక్షల విలువైన గుట్కాను టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. కాలనీలో నాగరాజు అనే వ్యక్తి వద్ద గుట్కా నిల్వలు ఉన్నట్లు సమాచారం అందుకుని టాస్క్‌ఫోర్స్ సీఐ రవికుమార్ తన సిబ్బందితో కలిసి శనివారం దాడులు చేశారు. దాడిలో నిషేధిత గుట్కాను స్వాధీనం చేసుకుని నాగరాజును అదుపులోకి తీసుకుని విచారణ నిమిత్తం ఇంతేజార్‌గంజ్ పోలీసులకు అప్పగించారు.

## కేయూలో సైన్స్ పీజీ కోర్సుల తరగతులు షురూ..

కేయూ క్యాంపస్, జూలై 13: కాకతీయ యూనివర్సిటీ దూరవిద్య కేంద్రం పీజీ సైన్స్ కోర్సుల మొదటి సెమిస్టర్ తరగతులు శనివారం ప్రారంభమయ్యాయి. జంతుశాస్త్ర విభాగం సెమినార్ హాల్‌లో జరిగిన ప్రారంభ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి మాట్లాడారు. కేయూలో ఈ ఏడాది దూరవిద్య కేంద్రంలో పీజీ కోర్సుల్లో అడ్మిషన్లు బాగా పెరిగాయని చెప్పారు. జువాలజీ, బాటనీ, కెమిస్ట్రీ, ఫిజిక్స్, గణితశాస్త్రం కోర్సుల్లో స్టడీ మెటీరియల్‌ను అందచేస్తామని చెప్పారు. విద్యార్థులు తరగతులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం మాట్లాడుతూ.. థియరీ క్లాస్‌లకు విద్యార్థులకు రెగ్యులర్‌గా హాజరుకావాలని, తర్వాత ప్రాక్టికల్స్ క్లాస్‌లు నిర్వహిస్తామని చెప్పారు. వర్సిటీలో మొదటిదఫాగా యూజీసీ డెబ్ ఆదేశాల మేరకు సెమిస్టర్ విధానంలో పరీక్షలు నిర్వహిస్తామని వెల్లడించారు. ఎస్డీఎల్‌సీఈ సైన్స్ కోర్సుల సహ సంచాలకుడు డాక్టర్ వెంకటగోపీనాథ్ మాట్లాడుతూ.. రెగ్యులర్ కోర్సులకు దీటుగా దూరవిద్య విధానంలో తరగతులు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సైన్స్ విభాగాల అధిపులు డాక్టర్ భారవీశర్మ, డాక్టర్ మంజుల, డాక్టర్ ఇస్తారీ, డాక్టర్ లలితకుమారి, డాక్టర్ ముస్తాఫా, డాక్టర్ జ్యోతి, డాక్టర్ హన్మంతు తదితర విద్యార్థులు పాల్గొన్నారు.


హాజరైన ఎస్డీఎల్‌సీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, ఇతర అధ్యాపకులు

# వరంగల్‌పై సీఎందీ నాదీ ఒకే విజన్

**హైదరాబాద్‌కు దీటుగా అభివృద్ధి చేయాలనేదే లక్ష్యం : 'కుడా' చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి**

ఇంటర్వ్యూ INTERVIEW

**(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)**

హైదరాబాద్‌కు దీటుగా వరంగల్‌ను అభివృద్ధి చేయాలనే సీఎం రేవంత్‌రెడ్డి విజనే తన విజన్‌గా పని చేస్తానని, ఎయిర్‌పోర్టు, నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైయినేజీని తీసుకరావటంతో పాటు రింగ్ రోడ్, సాఫ్ట్‌వేర్ కంపెనీలను నెలకొల్పడం లక్ష్యంగా ప్రణాళిక రూపొందిస్తున్నామని కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ ఆథారిటీ (కుడా) నూతన చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి స్పష్టం చేశారు. శనివారం 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధికి విచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన కుడా అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలను వెల్లడించారు. పేదలకు కుడా ప్లాట్లను అందుబాటులోకి తీసుకరాడటంతో పాటు కూడా పరిధిని విస్తరించటం.. కాళోజీ కళాక్షేత్రం, వరంగల్ బస్టాండ్ నిర్మాణం, నగరంలో జంక్షన్‌ల అభివృద్దే లక్ష్యంగా పని చేస్తానన్నారు.

ఆంధ్రజ్యోతి ప్రతినిధి: కుడా చైర్మన్‌గా ఎంపిక కావటంపై మీ స్పందన?

ఇనుగాల వెంకట్రామిరెడ్డి: కాంగ్రెస్‌లో ఓ సాధారణ కార్యకర్తగా.. పార్టీ ఏ కార్యక్రమం ఇచ్చినా విజయవంతంగా పని చేశా. 2014 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయినా ప్రజల్లోనే ఉన్నా. 2018, 2023లో కొన్ని కారణాల వల్ల పార్టీ టికెట్ ఇవ్వకపోయినా పార్టీ అభ్యున్నతికి కృషి చేశా. రేవంత్‌రెడ్డి పాదయాత్రతో పాటు ఇటీవల జరిగిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో శక్తివంచన లేకుండా కృషి చేశా. ఇవన్నీ సీఎం రేవంత్‌రెడ్డి గుర్తించి కూడా చైర్మన్ పదవిని అప్పగించారు. ఈ రెండేళ్ల కాలంలో వరంగల్ కుడా పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలతో పాటు కాంగ్రెస్ కార్యకర్తల కష్టాసుఖాల్లో పాలుపంచుకుంటా. ప్రజలకు సేవ చేసేందుకు కూడా చైర్మన్ పదవి దక్కింది. తప్పకుండా సీఎం సహకారంతో కుడా పరిధిలో నా మార్కు అభివృద్ధి ఉండేలా పని చేస్తా.

ఆంధ్రజ్యోతి: కుడా చైర్మన్‌గా మీ విజన్ ఏంటి?

వెంకట్రామిరెడ్డి: సీఎం రేవంత్‌రెడ్డికి వరంగల్‌ను హైదరాబాద్‌కు దీటుగా అభివృద్ధి చేయాలనే పట్టు దలతో ఉన్నారు. ఆయన ఏ విజన్‌తో ఉన్నారో నేనూ అదే విజన్‌గా పని చేస్తా. ప్రధానంగా వరంగల్‌కు అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పూర్తి చేయటం లక్ష్యంగా పెట్టుకున్నాం. అలాగే ఎయిర్‌పోర్టుకు దారిని విస్తరించడంతో పాటు త్వరలోనే వరంగల్ మామునూరు నుంచి విమానాలు ఎగిరేలా పని చేస్తున్నాం. ఇప్పటికే చాలా వరకు పూర్తి అయినా రింగ్‌రోడ్డు పనులు ఇంకో ఐదారు కిలో మీటర్ల వరకు మిగిలి ఉంది. దీనికి కావాల్సిన రూ.300కోట్ల వరకు సీఎం మంజూరుకు హామీ ఇచ్చారు. త్వరలోనే రింగ్‌రోడ్డును పూర్తి చేస్తాం. ప్రస్తుతం కూడా ఆధ్వరంలో మూడు వెంచర్లున్నాయి. వాటిలో పేదలు ప్లాట్లు కొనేలా అభివృద్ధి చేస్తున్నాం. నగరం చుట్టూ అనధికారిక ప్లాట్లు భారీగా ఏర్పాటు చేశారు. వాటిని గుర్తించి లేఅవుట్‌లుగా మార్చేలా ప్రయత్నాలు చేస్తాం. నాన్ లేఅవుట్ ప్లాట్లలో ప్లాట్ కొనుగోలు చేయకుండా ప్రజల్లో అవగాహన తీసుకవస్తాం. ఫామ్ ల్యాండ్ పేరుతో జరుగుతున్న భూక్రయ విక్రయాలపై దృష్టి పెడుతున్నాం.

ఆంధ్రజ్యోతి: హైదరాబాద్‌కు దీటుగా అంటే ఎలాంటి అభివృద్ధి చేస్తారు?

వెంకట్రామిరెడ్డి: హైదరాబాద్ నగరంలో ఉన్న సౌకర్యాలు వరంగల్ వాసులకు తీసుకరావటం ప్రధానం. అలాగే వరంగల్‌లో ఇంటర్నేషనల్ స్టేడియం ఏర్పాటుకు పలు సంస్థలు ముందుకు వస్తున్నాయి. దీన్ని పూర్తి చేస్తే అంతర్జాతీయ క్రీడలు ఇక్కడే నిర్వహిస్తారు. 50 ఎకరాల్లో కొత్తగా స్టేడియం ఏర్పాటు చేసి వరంగల్‌ను స్పోర్ట్స్ సిటీగా అభివృద్ధి చేయాలనేది నా లక్ష్యం. అలాగే మెడికల్ హబ్‌గా వరంగల్‌ను హైదరాబాద్‌కు దీటుగా అభివృద్ధి చేస్తాం. ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రతో పాటు చుట్టు పక్కల జిల్లాల నుంచి ప్రజలు వైద్యం కోసం వరంగల్‌కు వచ్చేలా సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఉంది. ఇందుకు కావాల్సిన భూమిని కూడా సమకూర్చుతుంది. ఐటీ కంపెనీలను వరంగల్‌కు తీసుక వచ్చేందుకు దృష్టి పెడుతున్నాం. మడికొండ ఏరియాలో డంపింగ్ యార్డు నుంచి చెత్త ద్వారా విద్యుత్ ఉత్పత్తికి ప్లాన్ చేస్తున్నాం. దీంతో ఐటీ కంపెనీల ఏర్పాటుకు చాల వరకు ఆటంకాలు లేకుండా పోతుంది.

ఆంధ్రజ్యోతి: కుడా చేపట్టిన పనుల్లో పురోగతి ఎలా ఉంది?

వెంకట్రామిరెడ్డి: కుడా ఆధ్వర్యంలో ప్రజలకు దీర్ఘకాలికంగా ప్రయోజనం ఉండే పనులపై దృష్టి పెట్టాం. గత ప్రభుత్వం అంచనాలు లేకుండా కొన్ని పనులు చేపట్టి మధ్యలోనే వదిలేసింది. వాటిలో ప్రధానంగా బాలసముద్రంలో కాళోజీ కళాక్షేత్రాన్ని రూ.90కోట్లతో చేపట్టి నిధులు లేక మధ్యలోనే వదిలేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో కాళోజీ కళా క్షేత్రాన్ని సెప్టెంబరు 9వ తేదీలోపు పూర్తి చేసేలా పనుల్లో వేగం పెంచాం. ఇప్పటి వరకు 80శాతం పనులు చేశాం. అలాగే వరంగల్ బస్టాండ్‌కు రూ.250కోట్లు కేటాయించాం. మొదటి విడతలో రూ.125 కోట్లతో చేపట్టే పనులను కుడా ఆధ్వర్యంలో ప్రారంభించారం. మోడల్ బస్టాండ్‌గా అభివృద్ధి చేస్తాం. వరంగల్ ఓ సిటీ ఏరియాలో కుడా 8 ఎకరాల వరకు భూమి ఉంది. ఈ భూమిని ఏలా అభివృద్ధి చేయాలో స్థానిక మంత్రితో చర్చించి నిర్ణయం తీసుకుంటాం. వరంగల్ మహానగరంలో జంక్షన్ల అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి పెడుతున్నాం.

ఆంధ్రజ్యోతి: కుడా పరిధి పెంచటం.. మాస్టర్ ప్లాన్‌పై మీ వైఖరి?

వెంకట్రామిరెడ్డి: కుడా పరిధిని కచ్చితంగా పెంచుతాం. ప్రస్తుతం కుడా పరిధిలో 180 గ్రామాలున్నాయి. సుమారు 25కిలో మీటర్ల వరకే కుడా విస్తరించి ఉంది. దీన్ని ఎంత మేర పెంచాలనే దానిపై మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీల అభిప్రాయాలను తీసుకుని నిర్ణయం తీసుకుంటాం. గత ప్రభుత్వం తీసుకవచ్చిన మాస్టర్ ప్లాన్‌ను మారుస్తున్నాం. సీఎం ఆదేశాల మేరకు 2050 వరకు ఉపయోగపడేలా కొత్త మాస్టర్ ప్లాన్‌ను రూపొందిస్తున్నాం. మరో మూడు, నాలుగు నెలల్లో దాన్ని అమలు చేస్తాం.

ఆంధ్రజ్యోతి: వ్యాపారంలో స్థిరపడిన మీరు రాజకీయాల్లోకి రావాలని ఎందుకనుకున్నారు?

వెంకట్రామిరెడ్డి: మా కుటుంబం వ్యాపార పరంగా స్థిరపడింది. మా ఒక్క కూతురూ కెనడాలో ఉన్నారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్‌కు ఉపాధ్యక్షుడిగా, డక్కన్ క్రానికల్ సీఈవోగా పని చేశా. 2012లో పరకాల ఎమ్మెల్యే కొండా సురేఖ వైసీపీలోకి వెళ్లటంతో నాటి సీఎం కిరణ్‌కుమార్ రెడ్డితో ఉన్న సత్సంబంధాలతో ఆయన పరకాల రాజకీయాల్లోకి పంపారు. ఆ తరువాత సొంత గడ్డపై ప్రజలకు సేవల చేయాలనే లక్ష్యంతో 2013 సహకార ఎన్నికల్లో పోటీ చేశా. ఇక ఖమ్మం శారద కాలేజీలో స్టూడెంట్ ఉన్నప్పుడు లీడర్‌గా పని చేసిన అనుభవం ఉండటంతో రాజకీయాల్లో సులభంగానే నెట్టుకవచ్చాను. 2023లో కూడా కొత్తవారికి అవకాశం ఇవ్వాలని అధిష్ఠానం ఆదేశిస్తే పోటీ నుంచి తప్పుకున్నా. వచ్చే అసెంబ్లీ ఎన్నికల వరకు నియోజకవర్గాల పునర్విభజన జరుగుతుంది. ఆ సమయంలో సీఎం రేవంత్‌రెడ్డి తీసుకునే నిర్ణయంపై పోటీ గురించి ఆలోచిస్తా. పరకాల ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి, మంత్రి సురేఖతో సహ ఎవరితోనూ ఎలాంటి విబేధాలు లేవు. అందరితో కలిసి పని చేస్తా. ఈ రోజు కుడా కుర్చీలో కూర్చున్నానంటే అది కేవలం కార్యకర్తల కష్టఫలమే. వారికి అండగా ఉంటూ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తా.





# రైల్వే కోచ్‌ఫ్యాక్టరీ కోసం ప్రశ్నిస్తా..

**● వరంగల్ ఎంపీ కడియం కావ్య ● రైల్వే సమస్యలపై టీ రైల్వే జేఏసీ రౌండ్ టేబుల్ సమావేశం**



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ కడియం కావ్య

కాజీపేట, జూలై 13: కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ సాధనకోసం కేంద్ర ప్రభుత్వాన్ని ఎన్నిసార్లైనా ప్రశ్నిస్తానని, డివిజన్ సాధనే లక్ష్యం పని చేస్తేనే తన రాజకీయ జీవితానికి సార్థకం అవుతుందని వరంగల్ ఎంపీ కడియం కావ్య అన్నారు. రైల్వే సమస్యల పరిష్కారానికి తెలంగాణ రైల్వేఎంప్లాయిస్ జేఏసీలో తనకు కూడా సభ్యత్వం ఇవ్వాలన్నారు. కాజీపేట రైల్వే కమ్యూనిటీ హాల్‌లో తెలంగాణ రైల్వే ఎంప్లాయిస్ జేఏసీ ఆధ్వర్యంలో శనివారం రైల్వే సమస్యలపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది.. జేఏసీ కన్వీనర్ దేవులపల్లి రాఘవేందర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా ఎంపీ కడియం కావ్య పాల్గొని మాట్లాడారు. వరంగల్ ఎంపీగా ప్రతీ సమస్యపై పోరాటం చేస్తానన్నారు. ఒక ఏడాదిలో పలు సమస్యలపై పార్లమెంట్‌లో పదిసార్లు మాట్లాడిన కడియం శ్రీహరి బిడ్డగా సమస్యల పరిష్కారానికి పార్లమెంట్‌లో తనగొంతు వినిపిస్తానని ఉద్వేగంగా ప్రసంగించారు. కాజీపేటలో ప్లాట్‌ఫారాల విస్తరణ, లోకోపైలెట్‌ల సమస్యలు, రైల్వేలో ప్రైవేటీకరణ అడ్డుకోవడానికి తనవంతు కృషి చేస్తానన్నారు. ఆర్ఎస్ఎస్ ముసుగులో ప్రధాని మోదీ రిజర్వేషన్‌లు ఎత్తివేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. అంబేద్కర్ అన్ని వర్గాలకు న్యాయం చేశారని గుర్తుచేశారు. రాహుల్ గాంధీకి అన్ని సమస్యలపై అవగాహన ఉందన్నారు. రైల్వే బడ్జెట్‌లో కాజీపేటకు వాటా వచ్చే వరకు నిరంతర పోరాటం చేస్తానన్నారు. సమస్యల పరిష్కారానికి ఎవరికీ భయపడే ప్రసక్తేలేదన్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ.. కాజీపేటకు రైల్వేపరంగా కేంద్రం నుంచి న్యాయం జరగాలంటే తెలంగాణ ఎంపీలతో టీరైల్వే జేఏసీ ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. రైల్వేలో ఉద్యోగాలు మన పిల్లలకు దక్కాలంటే రైల్వే పోటీ పరీక్షల్లో అర్హత సాధించే విధంగా చదవాలన్నారు. ఆర్ఆర్‌బీ, ఆర్ఆర్‌సీ పరిధిలోనే పరీక్షలు నిర్వహించాలన్నారు. రైల్వే ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాల్సిందేనన్నారు. రైల్వేపరంగా కాజీపేటకు రావాల్సిన విషయాలపై ప్రత్యేక నివేదికను రూపొందించాలని జేఏసీ నాయకులకు సూచించారు. కాజీపేటలో అదనపు ఆర్వోబీని ఆరునెలల్లో అందుబాటులోకి తెస్తామన్నారు. ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ.. రైల్వే వ్యాగన్ పరిశ్రమలో భూమి కోల్పోయిన రైతులకు సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి రూ.5కోట్ల నష్టపరిహారం ఇప్పించానని చెప్పారు. పెన్షనర్‌ల కార్యాలయానికి స్థలం ఇప్పిస్తానని హామీ ఇచ్చారు.

అంతకు ముందు మజ్దూర్ యూనియన్ డివిజనల్ సెక్రటరీ పిల్లలమర్రి రవీందర్, జోనల్ అధ్యక్షుడు కాల్వ శ్రీనివాస్, ఆలిండియా ఎస్సీ ఎస్టీ అసోసియేషన్ అధ్యక్షుడు బి.వీరన్న, పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కె. సంగమయ్య, కృష్ణమూర్తి, సంఘ్ సీడబ్ల్యూసీ మెంబర్ సీహెచ్ మురళి, సంఘ్ డివిజనల్ అధ్యక్షుడు కొత్త మురళి, రైల్వే జేఏసీ చైర్మన్ కొండ్ర నర్సింగరావు, కోశాధికారి సీహెచ్ తిరుపతి, ఆల్ బ్రాంచ్ కో-ఆర్డినేటర్ నాయిని సదానందం, స్థానిక కార్పొరేటర్‌లు జక్కుల రవీందర్ యాదవ్, విజయశ్రీ రజాలీతోపాటు పలువురు నాయకులు రైల్వే సమస్యలపై చర్చించి రైల్వే పరిశ్రమల సాధన, తదితర విషయాలను ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువచ్చారు. సుమారు మూడు గంటలపాటు జరిగిన ఈ రౌండ్‌టేబుల్ చర్చా వేదికలో రైల్వే కార్మికులు, కాంగ్రెస్ నాయకులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

# ఏటూరునాగారంలో ఘోర రోడ్డు ప్రమాదం

**గేదె కళేబరాన్ని తప్పించబోయి కంటైనర్‌ను ఢీకొట్టిన ఆటో**

**దంపతులు, కూతురు సహా ఆటోడ్రైవర్ దుర్మరణం**

**మరొకరికి తీవ్ర గాయాలు**


ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన ఆటో

ఏటూరునాగారం రూరల్, జూలై 13 : రోడ్డుకు అడ్డంగా ఉన్న గేదె కళాబరాన్ని తప్పించబోయి కంటైనర్‌ను ఆటో ఢీ కొట్టడంతో దంపతులతోపాటు వారి కూతురు, ఆటోడ్రైవర్ మృతిచెందిన సంఘటన ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలో శనివారం రాత్రి జరిగింది. ఆటోడ్రైవర్‌కు తోడుగా వచ్చిన మరో వ్యక్తి గాయాలపాలయ్యాడు. కూతురిని బస్సు ఎక్కించేందుకు ఆ దంపతులు తమ గ్రామానికి చెందిన ఓ ఆటోను కిరాయికి తీసుకుని బయల్దేరిన క్రమంలో ఈ దుర్ఘటన జరిగింది.

ములుగు జిల్లా వాజేడు మండల కేంద్రానికి చెందిన కాకర్లపూడి సత్యనారాయణరాజు(72), కాకర్లపూడి సత్యవతి(65) దంపతులు.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తునిలో నివాసముంటున్న తన కూతురు సాగిరాజు అనిత (45)ను ఆమె ఊరికి పంపించేందుకు వాజేడు నుంచి ఏటూరునాగారంనకు శనివారం రాత్రి బయల్దేరారు. ఈ క్రమంలో వాజేడుకు చెందిన తలాండి నాగరాజుకు చెందిన ఆటోను కిరాయికి మాట్లాడుకోగా.. ఆటోలో వీరి ముగ్గురితో పాటు డ్రైవర్ నాగరాజుకు తోడుగా ఉండేందుకు అంజిరెడ్డి అనే మరోవ్యక్తి కూడా వచ్చాడు. వారి ఆటో ఏటూరునాగారం వస్తున్న క్రమంలో 163వ జాతీయరహదారిపై హైస్ట్రీట్ సమీపంలో రోడ్డుపై ఓ పాడిగేదే మరణించి ఉంది. ఆ కళేబరాన్ని తప్పించబోయి ఆటో ఎదురుగా వాజేడు వైపు వెళ్తున్న కంటైనర్‌ను ఢీకొట్టి ఆటో బోల్తా కొట్టింది. దీంతో కాకర్లపూడి సత్యనారాయణరాజు, కాకర్లపూడి సత్యవతితో పాటు డ్రైవర్ నాగారాజు అక్కడికక్కడే మృతి చెందగా సాగిరాజు అనిత, అంజిరెడ్డికి తీవ్రగాయాలయ్యాయి. వెంటనే వారిని తొలుత మండలకేంద్రంలోని సామాజిక ఆసుపత్రికి, అక్కడి నుంచి వరంగల్ ఎంజీఎంకు తరలించారు. చికిత్స అందిస్తున్న క్రమంలో మృతి చెందింది.

సత్యనారాయణరాజు, సత్య వతి, నాగరాజు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ములుగు జిల్లా ఆసుపత్రికి తర లించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించారు. ఇదిలా ఉంటే ప్రమాదం అనంతరం కంటైనర్ డ్రైవర్ వాహనంతో సహ పారితుండగా వాజేడు మండలం జగన్నాథపురానికి చెందిన వారు ఆ కంటైనర్‌ను అడ్డుకోగా వాహనా న్ని వదిలేసి డ్రైవర్ పరారయ్యాడు.


ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందిన అనిత


చికిత్స పొందుతున్న అంజిరెడ్డి

# సంపూర్ణ విద్యను అందించాలి

## రాష్ట్ర పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి సీతక్క



చల్వాయిలో విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

గోవిందరావుపేట, జూలై 13: ఉపాధ్యాయులు విద్యార్థులకు సంపూర్ణ విద్యను అందించాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. మండలంలోని చల్వాయి గ్రామంలో రూ.135 లక్షల సమగ్రశిక్ష నిధులతో నూతనంగా నిర్మించిన కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం తరగతిగదులు, వసతి భవనాన్ని కలెక్టర్ దివాకర, అదనపు కలెక్టర్ శ్రీజలతో కలిసి మంత్రి శనివారం ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ కేజీబీవీలోని విద్యార్థినులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. పదోతరగతి నుంచి కేజీబీవీ పాఠశాలలను అప్‌గ్రేడ్ చేసి ఇంటర్మీడియట్ విద్య అందిస్తున్నట్టు తెలిపారు. ఇలాంటి అవకాశాలను విద్యార్థినులు సద్వినియోగం చేసుకుంటూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. ప్రతి ఉపాధ్యాయుడు ఒక విద్యార్థి అని, నూతన పరిజ్ఞాన అంశాలను నేర్చుకుని విద్యార్థినులకు బోధించాలని, ఉపాధ్యాయుడి ప్రవర్తన విద్యార్థులపై ఉంటుందని, విద్యార్థులకు ఆదర్శప్రాయంగా నిలవాలని అన్నారు. విద్యార్థినులను ఎలాంటి అనుమతి లేకుండా బయటకు పంపించకూడదని విద్యాలయ అధికారులను మంత్రి ఆదేశించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, జీసీడీవో రమాదేవి, స్థానిక తహసీల్దార్ సృజన్‌కుమార్, కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయ ఎస్‌వో వెంకటలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### కేజీబీవీ విద్యార్థినులు ఉత్తమ ఫలితాలు సాధించాలి

కన్నాయిగూడెం: కేజీబీవీ విద్యార్థినులు పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు పొంది స్టేట్ ర్యాంకు సాధించాలని మంత్రి సీతక్క అన్నారు. మండలంలోని ముప్పనపల్లి కేజీబీవీ పాఠశాల భవనాన్ని కలెక్టర్ దివాకర, అడిషనల్ కలెక్టర్ శ్రీజతో కలిసి మంత్రి ప్రారంభించారు. 2020 నుంచి అరకొర వసతుల మధ్య పాఠశాల నిర్వహణ జరిగేదని, కొత్త భవనం అందుబాటులోకి రావడంతో విద్యార్థినుల కష్టాలు తొలగనున్నాయని అన్నారు. మరిన్ని మెరుగైన వసతులు కూడా ఇందులో కల్పిస్తామన్నారు. పదో ఫలితాల్లో జిల్లాలో మొదటి స్థానంలో నిలిచిన విద్యార్థిని శివాణిని సన్మానించారు. అనంతరం ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డీఈవో పాణిని, తహసీల్దార్ సలీం, ఎంఈవో రాజేష్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అఫ్సర్ పాషా, మండల ఇన్‌చార్జి జాడి రాంబాబు, పాఠశాల ఎస్‌వో అశ్విని, మాజీ జడ్పీటీసీ చందు, మాజీ ఎంపీపీ సమ్మక్క తదితరులు పాల్గొన్నారు.

### ఉన్నత లక్ష్యాన్ని సాధించుకోవాలి

తాడ్వాయి: కస్తూర్బా విద్యాలయంలో చదువుతున్న విద్యార్థినులు ఉన్నత లక్ష్యంతో ఉత్తమ ఫలితాలు సాధించాలని మంత్రి ధనసరి సీతక్క అన్నారు. మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో అదనపు తరగతిగదుల సముదాయాన్ని శనివారం ఆమె ప్రారంభించారు. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో మంత్రి సీతక్క పాల్గొని మాట్లాడారు. విద్యార్థినులు అనుకున్న లక్ష్యాన్ని సాధించాలంటే క్రమశిక్షణ కలిగి ఉండాలని, చదువుతూ దేన్నైనా సాధించవచ్చని అన్నారు. ప్రస్తుతం శాస్త్ర విజ్ఞానం అందుబాటులోకి వచ్చిందని, ప్రపంచంలో ఏమూలన ఏది జరిగినా క్షణాల్లో తెలిసిపోతుందని అన్నారు. విద్యార్థినులు తల్లిదండ్రుల ఆశలకు అనుకూలంగా చదువుకోవాలని, ఉపాధ్యాయుల నమ్మకాన్ని నిలబెట్టాలని సూచించారు. సమ్మక్క-సారలమ్మల స్ఫూర్తితో ఉన్నతంగా చదవాలని అన్నారు. అదేవిధంగా ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ విధులకు హాజరుకావాలని అన్నారు. కేజీబీవీలు ఎంతోమందికి విద్యను అందిస్తుందని, పాఠశాలలో చదువుతున్న విద్యార్థినులు టాపర్లుగా నిలవాలని సూచించారు. విద్యార్థినులు పరిశుభ్రత పాటిస్తూ మౌలిక వసతులను వినియోగించుకోవాలని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో కలెక్టర్ టీఎస్.దివాకర, అదనపు కలెక్టర్ పి.శ్రీజ, ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, డీఈవో పాణిని,మండల విద్యాశాఖ అధికారి యాప సాంబయ్య, నోడల్ ఆఫీసర్ కేశవరావు, కేజీబీవీ స్పెషలాఫీసర్ పుష్పనీల, వివిధశాఖల అధికారులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

### ఆరోగ్య కేంద్రం ప్రారంభం

ఏటూరునాగారం రూరల్: మండల పరిధి అల్లంవారిఘణపురంలో నిర్మించిన హెల్త్ సబ్‌సెంటర్‌ను మంత్రి ధనసరి సీతక్క ప్రారంభించారు. మండలంలోని పలు ఏజెన్సీ గ్రామాల్లో ఆమె పర్యటించారు. అల్లంవారిఘణపురంలో రూ. 16లక్షలతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంత్రి ప్రారంభించారు. ఏజెన్సీలోని పలు గ్రామాలకు మెరుగైన వైద్యసేవలు అందించడమే లక్ష్యంతో సబ్‌సెంటర్‌ను ప్రారంభించామన్నారు. వైద్యాధికారులతో పాటు సిబ్బంది అందుబాటులో ఉంటారని, రోగులకు సరిపడా మందులను అందుబాటులో ఉంచుతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ దివాకర తదితరులు పాల్గొన్నారు.

# సం‘పత్తి’ పెరగాలంటే..

**సస్యరక్షణ చర్యలు పాటిస్తే తెల్ల‘బంగారమే’.. • పత్తి పంటలో మంచి యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు**

కాటారం, జూలై 13: వాణిజ్య పంటల్లో ఒకటి పత్తి. సరైన మెలకువలు పాటిస్తేనే దీని సాగు లాభదాయకం. సస్య రక్షణ చర్యలు, మంచి యాజమాన్య పద్ధతులు పాటిస్తే తెల్ల ‘బంగారమే’ వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలు, వ్యవసాయాధికారుల సలహాలు అమలు చేస్తే పత్తి పంటకు తిరుగు ఉండదు.

పత్తి సాగులో ప్రపంచంలోనే మొదటి స్థానంలో ఉంది. ఎగుమతుల్లో రెండో స్థానం. అలాగే దేశంలో తెలంగాణ రాష్ట్రం పత్తి సాగు విస్తీర్ణంలో మూడో స్థానంలో ఉందని గణాంకాలు చెబుతున్నాయి. ఇటీవల కేంద్రం పత్తి పంట మద్దతు ధరను గణనీయంగా పెంచింది. ఈ ఏడాది జిల్లాలో అధిక విస్తీర్ణంలో పత్తి సాగు కావడంతో సరైన యాజమాన్య పద్ధతులు, సాగులో మెలకువలు, సస్యరక్షణ చర్యలు చేపడితే తక్కువ పెట్టుబడులతో అధిక దిగుబడులు సాధించొచ్చని కాటారం ఏవో గిరి రామకృష్ణ తెలుపుతున్నారు. పత్తి గింజలు మొలకెత్తిన నాటిన నుంచి మొక్కలు ఎదుగుతున్న దశలోనూ ఎండలు, వర్షాలతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నది. భారీ వర్షాలకు భూమిలో తేమ ఎక్కువై పంట ఎదుగుదల లేకుండా పోయింది. కలుపును నివారించి, భూమిలో అధిక తేమ లేకుండా చూస్తేనే పత్తి పంట బంగారం కానుంది.

### ఎరువుల యాజమాన్యం

పత్తి పంట సాగులో రైతులు మంచి ఎరువుల యాజమాన్య పద్ధతులు పాటించాల్సి ఉంటుందని అంటున్నారు శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు. ఇష్టమొచ్చినట్లు నత్రజని ఎరువులు వాడితే పత్తికి తెగుళ్ల అధికంగా వచ్చి దిగుబడులపై ప్రభావం పడుతుంది. ప్రధాన పోషకాలైన నత్రజని, భాస్వరం, పొటాష్ ఎరువులను సిఫారస్ చేసిన విధంగానే వాడాలి. ఎకరాకు 48 కిలోల నత్రజని (నల్లరేగడి నేలలకు సుమారు 2, తేలికపాటి నేలలకు 3 యూరియా బస్తాలు), 24 కిలోల భాస్వరం(1 బస్తా డీఏపీ) ఎరువును పూర్తిగా ఒకసారే చివరి దుక్కిలో కలియ దున్నాలి. 24 కిలోల పొటాష్ ఎరువు(ఒక పొటాష్ బస్తా)ను ఎకరాకు వాడుకోవాలి. నత్రజని పొటాష్ ఎరువులను 4 సమాన భాగాలుగా చేసి మొక్క మొదళల నుంచి 7-10 సెంటీ మీటరు దూరంలో పాదు తీసి గింజలు విత్తిన 20, 40, 60, 80 రోజుల్లో వేసుకోవాలి.

### తొలి దశలో సస్య రక్షణ చర్యలు

పంట తొలి దశలో 1-60 రోజుల వరకు రసం పీల్చే పురుగులు తెల్లదోమ, పచ్చదోమ, పేనుబంక, తామర పురుగులు ఎక్కువగా ఆశిస్తాయి. కొన్ని పద్ధతులు పాటిస్తే వీటిని నివారించుకోవచ్చు.

- రసం పీల్చే పురుగులను తట్టుకునే రకాల సాగు చేసుకోవాలి.
- సిఫారసు మేరకే నత్రజని ఎరువులు వాడాలి. అధిక మోతాదులో వాడితే పురుగు ఉధృతి పెరుగుతుంది.
- పత్తిలో అంతర పంటలుగా అలసంద, సోయాచిక్కుడు, పెసర, మినుము, కొర్రల వంటి రకాలను సాగు చేయడం వల్ల మిత్ర పురుగులు అభివృద్ధి చెందుతాయి.
- తొలి దశలో ఆశించే రసం పీల్చే పురుగులను అదుపు చేయడానికి కాండం మీద మందు పూత పద్ధతిని (బొట్టు పెట్టె పద్ధతి) పాటించాలి. 30, 45 రోజుల్లో మోనోక్రోటోఫాస్ ఒక వంతు, నాలుగు వంతుల నీటితో కలిపి కాండానికి పూత పూయాలి. మొక్క 60 రోజుల వయసులో ఇమిడాక్లోప్రిడ్ ఒక వంతు, 20వంతుల నీటిని కలిపి బొట్టుపెట్టాలి.
- కాండానికి పూత పెట్టడం వల్ల స్ప్రే ఖర్చులు తగ్గించుకోవచ్చు. అలాగే 60-80 రోజుల వరకు మిత్ర పురుగుల వృద్ధి జరిగి రసం పీల్చు పురుగులను అదుపు చేస్తాయి.
- రసం పీల్చు పురుగుల నివారణకు వేప గింజల కషాయం, వేపనూనె వాడుకోవచ్చు
- పురుగుల ఉధృతి ఎక్కువగా ఉంటే లీటరు నీటికి మోనోక్రోటోఫాస్ 2 ఎంఎల్ లేదా ఎసిఫేట్ 1.5గ్రాముల లీటరు నీటికి ఇమిడాక్లోప్రిడ్ 0.25ఎంఎల్ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి. మొక్క తొలి దశలో రెండు పురుగు మందులను కలిపి వాడొద్దు.

### 60-90 రోజుల పంట దశలో..

ఈ దశలో పూత ఏర్పడిన దగ్గరి నుంచి కాయ తొలచే పురుగు ఆశించడం మొదలవుతుంది. వీటిలో తలనత్త, శనగపచ్చపురుగు, పొగాకు లద్దె పురుగులు ముఖ్యం.

- వీటి నివారణకు లీటరు నీటిలో నొవాల్యురాన్ 1ఎంఎల్ లేదా లూఫెన్యురాన్ 1ఎంఎల్ లేదా ఎమామెక్టిన్ బెంజోయేట్ 0.5గ్రాములు కలిపి మొక్కలపై పిచికారీ చేయాలి.
- ఈ దశలో ఆశించు రసంపీల్చే పురుగులకు ఎసిటామిప్రిడ్ 0.2గ్రా లేదా థయోమిథాక్సికామ్ 2గ్రా, ఫ్లోనికామిడ్ 3గ్రాములు లేదా డైఫెన్త్యురాన్ 125ఎంఎల్ ప్రతి లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. ప్రతీ సారి పురుగుమందులు మార్చి మార్చి వాడాలి.

### 90 నుంచి 120 రోజుల మధ్య..

- ఈ దశలో సాధారణంగా శనగపచ్చ పురుగు ఉధృతి అధికంగా ఉంటుంది. బీటీ (బాసిల్లస్ తురెంజిసిస్)విధానంలో బీటీ ప్రోటీన్ స్థాయి పంట రోజులు పెరిగే కొద్దీ తగ్గుతుంది.



- పురుగు ఉధృతి అధికంగా ఉంటే మొదటిసారి థయోడికార్బ్ 1.5గ్రాములు లేదా క్వినాల్‌ఫాస్ 2ఎంఎల్ ప్రతి లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- రెండోసారి పిచికారీ అవసరం అయితే క్లోరంత్రానిలిప్రోల్ 0.3మి.లీ స్పైనోసాడ్ 0.3ఎంఎల్, ఇండాక్సాకార్బ్ 1ఎంఎల్ లేదా ఫ్లూబెండమైడ్ 0.3ఎంఎల్ లీటరు నీటికి కలిపి వాడుకోవాలి.

### 120 రోజుల తర్వాతి దశలో...

- ఈ దశలో గులాబీ రంగు పురుగు, పిండినల్లి ఉధృతి అధికంగా ఉంటుంది.
- పిండినల్లి నివారణకు ప్రోఫెనోఫాస్ 3ఎంఎల్, శాండోవిట్ లాంటి జిగురు మందులతో పిచికారీ చేయాలి. గులాబీరంగు పురుగు నివారణకు క్లోరంత్రానిలిప్రోల్, లామ్డాసైహాలోత్రిన్ కలిసి ఉన్న మందును పిచికారీ చేయాలి. పూర్తి స్థాయిలో సస్యరక్షణ చర్యలు, మెలకువలు పాటిస్తే రైతులు ఆశించిన మేర దిగుబడులు సాధ్యమవుతాయని, పత్తిపంట తెల్లబంగారంగా మెరుస్తుందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.



**యాజమాన్య పద్ధతులు పాటించాలి**

పత్తి సాగులో రైతులు మంచి యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడులు వస్తాయి. జిల్లాలో సుమారు లక్ష ఎకరాల విస్తీర్ణంలో పత్తి పంట సాగు కానుంది. రైతులకు వ్యవసాయ శాఖ నిరంతరం అందుబాటులో ఉండి సూచనలు, సలహాలు అందిస్తోంది. వీటిని తప్పక పాటించాలి

\- విజయ్‌భాస్కర్, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి

## ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్‌కు సన్మానం



ప్రకాశ్‌రెడ్డిని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

భూపాలపల్లిటౌన్, జూలై 13: ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాశ్‌రెడ్డికి భూపాలపల్లి పట్టణ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బడితల వెంకటస్వామి శనివారం సన్మానించారు. భవిష్యత్‌లో మరెన్నో పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోగుల మదన్‌మోహన్, పెంట సదానందం తదితరులు పాల్గొన్నారు.

## ఇంటింటి ఫీవర్ సర్వే

వెంకటాపురం(నూగూరు), జూలై 13: మండలంలోని చిరుతపల్లి, నూగూరు గ్రామాల్లో శనివారం వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఇంటింటి ఫీవర్ సర్వే జరిగింది. ఈసందర్భంగా వైద్యసిబ్బంది ఆయా గ్రామాల్లో ఇంటింటికీ తిరుగుతూ జ్వరపీడితుల వివరాలు సేకరించారు. అనంతరం వైద్యశిబిరం నిర్వహించి గ్రామస్థులకు వైద్యపరీక్షలు చేపట్టి మందులు పంపిణీ చేశారు. వర్షాకాలంలో వ్యాధుల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో వైద్యసిబ్బంది యాకలక్ష్మి, సరస్వతి, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో పీరీల సందడి

కాటారం, జూలై 13: మండలంలోని పలు గ్రామాల్లో పీరీల సందడి నెలకొంది. మొహర్రం మాసాన్ని పురస్కరించుకుని గ్రామాల్లో వారం రోజుల పాటు పీరీలను ఆడించి అనంతరం నిమజ్జనం చేయడం ఆనవాయితీ. మండలంలోని అంకుసాపూర్, చింతకాని, విలాసాగర్, గంగారం, గారెపల్లి, దేవరాంపల్లి తదితర గ్రామాల్లో అగ్ని గుండం నుంచి శనివారం ఉదయాన్నే పీరీలను తీసుకెళ్లి గ్రామాల్లో ఊరేగించారు. హిందువులు, ముస్లింలు కానుకలు కట్టి మొక్కులు చెల్లించుకున్నారు.

## డబుల్ బెడ్‌రూం లబ్ధిదారుల ఆందోళన



ఆందోళన చేస్తున్న డబుల్ బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారులు

భూపాలపల్లిటౌన్, జూలై 13: తమకు మంచినీటి సౌకర్యాన్ని కల్పించాలని డిమాండ్ చేస్తూ డబుల్‌బెడ్ రూం ఇళ్ల లబ్ధిదారులు ఖాళీ బిందెలతో శనివారం ఆందోళనకు దిగారు. భూపాలపల్లి పట్టణంలోని వేశాలపల్లి శివారు 540 డబుల్‌బెడ్ ఇళ్ల వద్ద మౌలిక సౌకర్యాల కల్పన కల్పించాలని నిరసన తెలిపారు. మంచినీటి కోసం బోరు వేశారు గానీ సక్రమంగా నీరు సరఫరా కావడం లేదని అన్నారు. బోరు మోటారు కోసం ప్రత్యేకంగా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని అన్నారు. డ్రెయినేజీ పరిశుభ్రత గురించి పట్టించుకోవడం లేదన్నారు.

## యూత్ కాంగ్రెస్ ఎన్నికల్లో పాల్గొనాలి

భూపాలపల్లిటౌన్, జూలై 13: యూత్ కాంగ్రెస్ ఎన్నికల్లో యువత అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వరంగల్ జోనల్ రిటర్నింగ్ అధికారి సందీప్ కుమార్ కోరారు. భూపాలపల్లి పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో యూత్ నాయకుల సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత దేశానికి వెన్నముకలాంటి వారని అన్నారు. రాబోవు తరానికి రాహుల్‌గాంధీ దేశ ప్రధాని కావడానికి యువత కీలక పాత్ర పోషించాలన్నారు.ఈ క్రమంలో యూత్ కాంగ్రెస్‌ను బలోపేతం చేయాలని అన్నారు. ఈ నెల 11 నుంచి సభ్యత్వాల కార్యక్రమం ప్రారంభమైందని, ఆగస్టు 5న ఎన్నికలు ఉంటాయని తెలిపారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు, ట్రేడ్ కౌన్సిల్ చైర్మన్ అయిత ప్రకాశ్‌రెడ్డి, టీపీసీసీ సభ్యుడు చల్లూరి మధు, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు భట్టు కర్ణాకర్, నాయకులు శ్రీకాంత్, రంజిత్, శ్రీనివాస్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## దంపతులను చంపిన ఉన్మాదికి ఉరిశిక్ష వేయాలి

### గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గోవింద్ నాయక్

ములుగు కలెక్టరేట్, జూలై 13: వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం పదహారుచింతలతండా గ్రామానికి చెందిన బానోత్ శ్రీనివాస్,సుగుణ దంపతులను నరికి చంపిన ఉన్మాది మేకల నాగరాజుకు ఉరిశిక్ష వేయాలని గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పోరిక గోవింద్‌నాయక్ డిమాండ్ చేశారు. ములుగులో బంజారాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎలాంటి సమస్యలైనా సామరస్యంగా పరిష్కరించుకోవాలే తప్ప దాడులు చేయడం సమంజసం కాదని అన్నారు. ఇలాంటి సంఘటనలు రాష్ట్రంలో పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. శ్రీనివాస్ కుటుంబానికి రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియాతోపాటు ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలన్నారు. అదేవిధంగా పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డికి వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టాడనే ఆరోపణలతో లంబాడా యువకుడిని విచక్షణారహితంగా ఎస్సై కొట్టడం దారుణమని విమర్శించారు. ఆ ఎస్సైపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బంజారా ఐక్యవేదిక నాయకులు పోరిక లాల్, భూక్యా సోమానాయక్, జర్పులు బాలు, పోరిక సర్వన్, జయరాం, అంగోత్‌రాజు, గుగులోత్ రాందేవ్, సారయ్య, వినాయక్, సునీల్‌కుమార్, శంకర్, రఘురాం, సమ్మయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు మంత్రి, ఎంపీకి సన్మానం

ములుగు రూరల్ జూలై 13: రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి సీతక్క, మహబూబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్‌తోపాటు డోర్నకల్ ఎమ్మెల్యే రామచంద్రనాయక్‌కు ములుగు మండలం మదన్‌పల్లిలో ఆదివారం పౌర సన్మానం జరగనుంది. ఈ మేరకు కార్యక్రమ కన్వీనర్ పి.ధనంజయ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మదన్‌పల్లి వాసి, ఐఏఎస్ అధికారి మౌనిక, రంగారెడ్డి జిల్లా జడ్జి పి.ప్రదీప్ నాయక్, హైదరాబాద్ గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ పి. శ్రవణ్ నాయక్, మాజీ మంత్రి పోరిక జగన్ నాయక్ తదితరులు హాజరై ప్రజా ప్రతినిధులను సన్మానిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## కల్యాణ మండప నిర్మాణానికి శంకుస్థాపన



కల్యాణ మండపం నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఆలయ కమిటీ చైర్మన్

రేగొండ, జూలై 13: మండలంలోని గడిపల్లి వేణుగోపాలస్వామి ఆలయంలో కల్యాణ మండపం నిర్మాణానికి శనివారం శంకుస్థాపన చేశారు. దాత పింగిలి సులోచనమ్మ రూ. లక్షల అందజేయగా ఆలయ కమిటీ చైర్మన్ ఏనుగు లింగారెడ్డి భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ పాపిరెడ్డి, అర్చకులు సముద్రాల సురేష్ ఆచార్యులు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మనోహర్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు కట్ల రాంరెడ్డి, పత్తి బుచ్చిరెడ్డి, రామచంద్రు తదితరులు పాల్గొన్నారు.

## కాళేశ్వరంలో భక్తుల సందడి

మహదేవపూర్, జూలై 13: మండలంలోని కాళేశ్వరంలో శనివారం భక్తుల సందడి నెలకొంది. రెండో శనివారం సెలవు కావడంతో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతోపాటు పక్కనే ఉన్న మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ తదితర రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. కాళేశ్వరం వద్ద త్రివేణి సంగమ గోదావరిలో స్నానాలు ఆచరించి స్వామి వారిని దర్శించుకున్నారు.

## కళాశాల ఫ్రెషర్స్ పార్టీలో అపశృతి

### గుండెపోటుతో వాచ్‌మన్ మృతి



సంతోష్ (ఫైల్)

వెంకటాపూర్(రామప్ప), జూలై 13: మండల కేంద్రంలోని మైనారిటీ కళాశాల ఇంటర్ ఫ్రెషర్స్ పార్టీలో అపశృతి జరిగింది. వాచ్‌మన్‌గా పనిచేస్తున్న గాదం సంతోష్ (48) గుండెపోటుతో మృతిచెందాడు. మండల కేంద్రంలోని ప్రభుత్వ మైనారిటీ కళాశాలలో శనివారం ఫ్రెషర్స్ పార్టీ జరిగింది. ఇదేరోజు విద్యార్థినుల తల్లిదండ్రులతో సమావేశం కూడా ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ఏటూరునాగారం మండలంలోని ఓ గ్రామానికి చెందిన విద్యార్థిని తల్లిదండ్రులు హాజరుకాలేదు. దీంతో విద్యార్థిని అసంతృప్తితో కళాశాల గేటు నుంచి బయటకు పరుగెత్తింది. గమనించిన వాచ్‌మన్ సంతోష్‌తోపాటు మరో ఇద్దరు విద్యార్థినులు వెనుక పరుగెత్తారు. ఈక్రమంలో వాచ్‌మన్ సంతోష్ పరుగెత్తి ఒక్కసారిగా కుప్పకూలాడు. వెంటనే 108కు సమాచారం అందించగా అతడిని ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు సంతోష్ అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు

## శ్రీరాంపతి కాల్వ పైపులైన్‌ను మార్చాలి

### రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు వెంకటరెడ్డి

గోవిందరావుపేట, జూలై 13: మండలంలోని లక్నవరం సరస్సు ఆయకట్టు పరిధి శ్రీరాంపతికాలువ పిచ్చయ్యగారి పైపులైన్‌ను మార్చాలని తెలంగాణ రైతుసంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు తుమ్మల వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం ఆయన ఆధ్వర్యంలో నాయకులు, రైతు లు కాల్వ పైపులైన్‌ను పరిశీలించారు. ఈసందర్భంగా వెంకటరెడ్డి మాట్లాడుతూ తూము కింద ఉన్న 120 ఎకరా లకు నీరు అందించాల్సి ఉండగా రాంపూర్ కాలువ మీద పైపులైన్ ద్వారా నీరు రావాల్సి ఉందని, గత 30ఏళ్లక్రితం వేసిన పైపులైన్ శిథిలావస్థకు చేరుకుందని అన్నారు. దీంతో పైపులైన్ ద్వారా ఖరీఫ్ సీజన్‌లో నీరు వచ్చే అవకాశం లేదని అన్నారు. ప్రభుత్వం కాలువల మరమ్మతు పనులను రూ.కోటి నిధులతో చేపడుతుండగా పైపులైన్ పనులు కూడా చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇప్పటి వరకు కాంట్రాక్టర్ శ్రీరాంపతి కాలువ కింద ఈదుల మత్తడి సగం పనులు చేసి నిలిపివేశాడని, ఇక్కడ పైపులైన్ పనులు కూడా మొదలు పెట్టలేదని అన్నారు. ఈవిషయమై సంబంధిత శాఖ అధికారులు స్పందించి పైపులైన్ పనులు చేపట్టేవిధంగా చర్యలు తీసుకో వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో నాయ కులు, రైతులు బాధావత్ లక్ష్మణ్‌నాయక్, బాలు, ధరావత్ రాకేష్, మట్ట వెంకటపా°ఎరెడ్డి, ఏనుగు యాదిరెడ్డి, పూర్ణచందర్, రామారావు, యాదయ్య, వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

## ముమ్మరంగా పోలీసుల తనిఖీలు

కాటారం, జూలై 13:మండల కేంద్రంలో శనివారం రాత్రి పోలీసులు విస్తృతంగా వాహనాల తనిఖీలు చేశారు. జిల్లా ఎస్పీ కిరణ్‌ఖరే ఆదేశాల మేరకు సీఐ నాగార్జునరావు నేతృత్వంలో ఎస్సై అభినవ్, ఎస్సై-2 హరిశేఖర్‌ల ఆధ్వర్యంలో పోలీస్‌సిబ్బంది ప్రత్యేక వాహనాల తనిఖీ కార్యక్రమం నిర్వహించారు. మైనర్లు ద్విచక్రవాహనాలు నడుపుతుండటం, వాహనదదారుల రాంగ్ రూట్ డ్రైవింగ్‌పై దృష్టి పెట్టిన పోలీసులు అంబేద్కర్ కూడలి, బస్టాండ్, చింతకాని క్రాస్ రోడ్డు, పోలీస్‌స్టేషన్ తదితర చోట్ల విస్తృతంగా వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మైనర్లు నడుపుతున్న 4 బైక్‌లు, రాంగ్‌రూట్‌లో వెళ్తున్న 8బైక్‌లు, నెంబర్‌ప్లేట్స్ లేని 10కి పైగా వాహనాలను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

- వాజేడు: భూపాలపట్నం-హైదరబాద్ 163వ జాతీయ రహదారి జగన్నాథపురం వై జంక్షన్ వద్ద శనివారం పోలీసులు ముమ్మరంగా వాహనాల తనిఖీలు నిర్వహించారు. పేరూరు ఎస్సై గుర్రం కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో సీఆర్పీఎఫ్, సివిల్ పోలీసులు ఈ తనిఖీలు చేపట్టారు. మద్యం సేవించి డ్రైవింగ్ చేస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకున్నారు. ఛత్తీస్‌గఢ్, వరంగల్, భద్రాచలం వైపు నుంచి వస్తున్న ప్రయాణికుల వాహనాలను క్షుణ్ణంగా సోదా చేశారు. సరైన ధృవపత్రాలు లేనటువంటి వాహనాలకు జరిమానా విధించారు.

## గుట్కాల కంటైనర్ పట్టివేత

ఏటూరునాగారం రూరల్, జూలై 13: గుట్కాలు, పాన్‌మసాలా, తంబాకు లోడుతో తరలిస్తున్న కంటైనర్ లారీని పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. ఢిల్లీ నుంచి ఛత్తీస్‌గఢ్ దాటి 163వ జాతీయ రహదారి మీదుగా బెంగళూరుకు తీసుకెళ్తున్న క్రమంలో పట్టుబడింది. ఏటూరునాగారం ఫారెస్టు చెక్‌పోస్టు వద్ద పోలీసులు సాధారణ తనిఖీలు చేపడుతుండగా కంటైనర్ లారీ తారస పడింది. దానిని తనిఖీ చేయగా గుట్కాలు, పాన్ మసాలాలు, తంబాకు ప్యాకెట్లు ఉన్నాయి. మొత్తం 170 బ్యాగుల్లో ఇవి ఉండగా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

## మేడిగడ్డ బ్యారేజీకి తగ్గుముఖం పట్టిన వరద

మహదేవపూర్ రూరల్, జూలై 13 : కాళేశ్వరం ప్రాజెక్టులో ప్రధానమైన మేడిగడ్డ బ్యారేజీకి వరద కాస్త తగ్గుముఖం పట్టింది. వారం రోజులుగా బ్యారేజీకి వరద క్రమంగా పెరుగుతూ రాగా శనివారం తగ్గింది. బ్యారేజీలోకి 41,500క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోందని అధికారులు తెలిపారు. 85గేట్లను ఎత్తి అంతేనీటిని దిగువకు పంపిస్తున్నామని చెప్పారు.

## ‘అన్నారం’లో కొనసాగుతున్న పరీక్షలు

మహదేవపూర్: కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా అన్నారం వద్ద నిర్మించిన సరస్వతీ బ్యారేజీ వద్ద పూణెకు చెందిన నిపుణుల బృందం చేపట్టిన పరీక్షలు కొనసాగుతున్నాయి. గతంలో బుంగలు పడిన నేపథ్యంలో ఇక్కడ జియో ఫిజికల్ టెస్టులు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం డౌన్ స్ట్రీమ్ పనులను చేపట్టారు.

## టీఎండీసీ పీవోను నిలదీసిన సీపీఎం నేతలు

వెంకటాపురం(నూగూరు): మండలంలో రోడ్డుకు ఇరువైపులా ఇసుక లారీలు పెట్టకుండా చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు శనివారం టీఎండీసీ పీవో శ్రీరాములును నిలదీశారు. మండలంలోని పాత్రాపురం గ్రామం నుంచి రోడ్డుకు ఇరువైపులా లారీలు పెట్టడం వల్ల ప్రయాణికులు, వాహన దారులు తీవ్ర ఇబ్బందిపడుతున్నారని అన్నారు. దీంతో స్పందించిన టీఎండీసీ పీవో శ్రీరాములు మాట్లాడుతూ హెడ్ ఆఫీస్ నుంచి పెద్దసంఖ్యలో డీడీలు రావడం వల్ల ఈ సమస్య తలెత్తుతుందని, రేపటి నుంచి నాలుగురోజులపాటు లోడింగ్ నిలిపివేస్తామని అన్నారు. మండలంలో లారీలతో ఇబ్బందులు తలెత్తకుండా ర్యాంపులకు అనుగుణంగా అనుమతులు ఇస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో సీపీఎం నాయకులు బీరెడ్డి సాంబశివ, గ్యానం వాసు, కట్ల నర్సింహాచారి, విజయ్‌కుమార్, మాణిక్యం పాల్గొన్నారు.

### నిర్బంధాలతో పోరాటాలను ఆపలేరు

వాజేడు : నిర్బంధాలతో పోరాటాలను ఆపలేరని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బీరెడ్డి సాంబశివ అన్నారు మండల కేంద్రంలోని గుడిసెల పోరాట కేంద్రం వద్ద ఆ పార్టీ నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. పేదల పోరాటాన్ని ఓర్వలేక స్వార్థపరులు గుడిసెలు కూల్చాలని అధికారులపై ఒత్తిడి చేస్తున్నారని, మండపాకలో గుడిసెల పోరాటం ప్రారంభించి పదినెలలు అయిందని ఇప్పుడు పార్కుల పేరుతో గుడిసెలను తొలగించేందుకు అధికారులను ఉసిగొల్పుతున్నారని మండిపడ్డారు. పదినెలలుగా లేని పార్కు ఇప్పుడు ఎక్కడి నుంచి వచ్చిందని ఆయన ప్రశ్నించారు. మహిళలు అని కూడా చూడకుండా దౌర్జన్యం చేస్తున్నారని, గుడిసెలు కూల్చేందుకు వెళ్లిన అధికారులను మహిళలు ప్రతిఘటించడంతో అధికారులు వెనక్కి తగ్గారన్నారు.

పేదలకు తలదాచుకునేందుకు ఇంటి స్థలం ఇవ్వకపోగా కేసులు పెడతామని బెదిరించడం ఎంత వరకు సబబు అని నిలదీశారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి కొప్పుల రఘుపతిరావు, నాయకులు దామోదర్, దేవయ్య, కృష్ణబాబు, ముత్తయ్య, సౌమ్య, కుమారి, పూనెం కృష్ణబాబు, శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.